రైతు రుణమాఫీకి కృషి చేయాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఘట్‌కేసర్: ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతు రుణమాఫీని ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు పూర్తి స్థాయిలో వర్తింపజేయాలని రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతుగా అఖిలపక్ష నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రైతుల సమస్యలు పరిష్కారించాలని కోరారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



శ్రీకృష్ణపురి కాలనీలో లడ్డూతో బషీర్

జవహర్‌నగర్: మతసామరస్యానికి ఆదర్శంగా వినాయకుడి లడ్డూను ముస్లిం వ్యక్తి వేలంలో దక్కించుకున్నాడు. జవహర్‌నగర్ కార్పొరేషన్ శ్రీకృష్ణపురి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను బషీర్ రూ.22 వేలకు దక్కించుకున్నాడు. మరో లడ్డూను కోటగిరి ఆంజనేయులు రూ.14 వేలకు దక్కించుకున్నాడు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



మేడ్చల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఉత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద జోరుగా సాయంత్రం పూజలు చేస్తున్నారు. కుంకమార్చనలు, హోమాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. మధ్యాహ్నంతో పాటు రాత్రి సమయాల్లో అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని దళిత సంఘాల జేఏసీ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మేడ్చల్‌లో విడుదల చేశారు. జేఏసీ నాయకులు స్థానిక నేతలతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించే వరకు ఉద్యమం చేస్తామని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి స్పష్టం చేశారు. వివిధ సంఘాల నాయకులు విజయారావు, కిషోర్, హృదయరంజన్, ప్రవీణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యకు ప్రత్యేక పూజలు



జవహర్‌నగర్ ప్రత్యేక పూజల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిమజ్జనానికి వినాయక విగ్రహాలను ఆటపాటలతో భక్తులు తరలించారు.

నిమజ్జనంలో అపశ్రుతి

విద్యుదాఘాతంతో బ్యాంకు ఉద్యోగి మృతి

మేడ్చల్: వినాయక నిమజ్జనం సందర్భంగా ఉట్టి కొట్టే సమయంలో ఓ బ్యాంకు ఉద్యోగి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీలో పోచమ్మ గుడి వద్ద ఉన్న వినాయకుడి నిమజ్జనం జరిపే క్రమంలో భక్తులు ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి నిమజ్జనం సందర్భంగా రెండు స్తంభాల మధ్య ఇనుప తీగ ఓ వైపు, సిమెంట్ స్తంభం మరో వైపు ఇనుప స్తంభం ఉంది. కార్యక్రమం జరుగుతుండగా.. ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగి నరేష్ (30) మరో చిన్నారి తీగను పట్టుకున్నారు. ఉట్టి కొట్టే క్రమంలో మధ్యలో ఉన్న తీగ తెగిపడటంతో నరేష్ విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

భోగారం చౌరస్తాలో..



గుంతలమయమైన కరీంగూడ రహదారి



గుంతలు.. చింతలు !

కీసరలో గుంతలయమంగా ప్రధాన రహదారులు | కాలనీల్లో మరింత అధ్వానంగా మారిన వైనం

కీసర: ఉమ్మడి కీసర మండల పరిధిలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రధాన రహదారుల్లో అక్కడక్కడ 2–3 అడుగుల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారుల గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులకు మరమ్మత్తు పనులు చేపట్టాలని, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు విన్నవించినా.. పరిస్థితి మాత్రం మారడం లేదని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు.

◆ కరీంగూడ- భోగారం రహదారి, భోగారం ఘట్‌కేసర్ ప్రధాన రహదారిలో భోగారం జంక్షన్, కీసర చౌరస్తా, కీసర- నూకలగూడెం, అంకిరెడ్డిపల్లి రహదారి, చీర్యాల -యాద్గార్‌పల్లి దమ్మాయిగూడ-నాగారం, అహ్మద్‌గూడ-హరిదాస్‌పల్లి, రాంపల్లి చర్లపల్లి- కరీంగూడ-సాయిగూడెం, దమ్మాయిగూడ-నాగారం కీసర నుంచి కుషాయిగూడ ప్రధాన రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అక్కడక్కడ దెబ్బతిన్నాయి.

కనీసం మరమ్మతులకు నోచుకోని పరిస్థితి

రహదారులకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారుల గుండా నిత్యం వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల తమ వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రయాణం ఇబ్బందికరంగా మారుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రిపూట ప్రమాదకరంగా..

ఇక రాత్రి వేళల్లో అయితే రోడ్ల మధ్యలో పడిన గుంతలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక నాగారం, దమ్మాయిగూడ రెండు మున్సిపాలిటీలో వివిధ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కాలనీల రహదారులు కూడా దెబ్బతింటున్నాయి. మట్టి రోడ్లు ఉన్న కాలనీలు బురదమయంగా మారిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల తరబడి కీసర, గోధుమకుంట, అహ్మద్‌గూడ, చీర్యాల, రాంపల్లి, నాగారం, దమ్మాయిగూడ తదితర ప్రాంతాల్లో కొన్ని కాలనీల్లో అంతర్గత కాలనీ రహదారులు ఇప్పటికి మట్టి రోడ్లే.

చిన్నపాటి వర్షానికే బురదమయంగా..

ఈ రహదారులు చిన్నపాటి వర్షం పడితే వరద నీరు నిలిచి రోజుల తరబడి బురదమయంగా ఉండటంతో రహదారుల గుండా వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న మట్టి రహదారులను సీసీరోడ్లుగా మార్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. సీసీరోడ్లు వేసిన కొన్ని కాలనీల్లో కుడా ఇష్టానుసారంగా సీసీరోడ్లు తవ్విన చోట వరద నీరు నిలిచి రహదారులు ధ్వంసమవుతున్నాయి.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



ఉమ్మడి కీసర మండల పరిధిలోని ప్రధాన రహదారులు ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులతో పాటు, ఆయా కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.

– కౌకుట్ల చంద్రారెడ్డి, నాగారం

చిన్నారులకు పోషకాహారాన్నే అందించాలి

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



చిన్నారులతో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట్: పోషకాలతో కూడిన ఆహారాన్నే చిన్నారులకు అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీ, లాల్‌గడి మలక్‌పేటలో హెచ్‌బీఎల్ భారత్ బాలల వికాసకేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతారణంలో పిల్లలను ఆడించాలని, అంగన్‌వాడీ సెంటర్‌కు రాని విద్యార్థుల పట్ల అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో నిల్వ ఉంచిన ఆహారంతో పాటు రికార్డులను పరిశీలించారు.

బస్టాండ్ మురుగుమయం !

● ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత ● దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు





మేడ్చల్ బస్టాండ్ ఆవరణలో మురుగు ఇలా..

మేడ్చల్: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు బస్టాండ్ ఆవరణంతా మురిగుమయంగా మారుతోంది. డ్రైనేజీ నీరు, వరద నీరు ఆవరణలో చేరి అధ్వానంగా మారింది. రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు, సిబ్బంది, ప్రయాణికులు దోమల బెడద, దుర్వాసనలతో తీవ్ర ఇబ్బంది పడుతూ.. రోగాల భారిన పడాల్సి వస్తోంది. ఓ వైపు సమీప ప్రాంతాల వారు వ్యర్థాల పారబోత, బహిరంగ మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

చిరుజల్లులకే చిత్తడిగా..

మరో వైపు చిరు జల్లులకే ఆవరణంతా చిత్తడిగా మారుతోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆవరణలో చిన్న చిన్న కుంటలు ఏర్పడుతున్నాయి. గేట్ల ముందు, సీసీ రోడ్డుపై మురుగు ప్రవహిస్తూ.. ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. బస్టాండ్ వెనుక, ముందుభాగం, పక్కన ప్రాంతంలో నీరు వారం పది రోజుల పాటు నిల్వ ఉండి ఇబ్బందులు కలిగిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. వర్షం కురిసిన ప్రతిసారి సమస్య ఏర్పడుతున్నా.. శాశ్వత పరిష్కారం లభించడం లేదనే స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఆర్టీసీ అధికారులకు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్నా.. వారు సరైన పరిష్కారం చూపడం లేదు. ప్రయాణికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నా.. మున్సిపల్ అధికారుల నుంచి స్పందన కరువైంది. ఆర్టీసీ యాజమాన్యం సమస్యను మున్సిపల్ అధికారులపైకి నెట్టేసి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురి వాదన.

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ మను చౌదరి



కీసర బాలుర రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కీసర: కీసరలోని బాలుర తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, లైబ్రరీలో బుక్స్, ఆట పరికరాలు కావాలని విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పాతభవనంలో వరద నీరు, గోడలకు నిమ్మ ఉండటాన్ని పరిశీలించి అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ సూచించారు. మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా..? లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. డీఈఓ విజయకుమారి, తహసీల్దార్ అశోక్, ప్రిన్సిపాల్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్యాత్ ల్యాబ్ ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో ఉపయోగపడే క్యాత్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. మెడిసిటీ ఆసుపత్రి గ్రూపులో భాగమైన మెడినోవా ఆసుపత్రిలో ఆధునిక క్యాత్ ల్యాబ్ అందుబాటులో ఉండటం వల్ల మేడ్చల్ ప్రాంతంలో 24/7లో గుండె పరిరక్షణకు ల్యాబ్ దోహదం చేస్తుందని వైద్యులు తెలిపారు. హార్ట్ ఎటాక్ నిర్వహణ, యాంజియోప్లాస్టీ, యాంజియోగ్రఫీ, ఫేస్ మేకర్ ప్రక్రియ, వంటి సేవలను ల్యాబ్ అందిస్తుందని తెలిపారు. వైద్యులు డాక్టర్ జగదీష్‌రెడ్డి, సీఈఓ ఇనీష్ మచ్చంట్, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కీసర: విద్యార్థులు పట్టుదలతో చదవాలని ప్రముఖ న్యాయవాది బోడల శ్రీనివాస్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ గణేష్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులో పోటీతత్వం పెంచేందుకు ఛాలెంజ్ ట్రోఫీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2024–2025 సంవత్సరంలో ప్రథమ స్థానంలో నాగారం ప్రభుత్వ పాఠశాల ట్రోఫీని దక్కించుకుంది. ఈ ట్రోఫీని బుధవారం తిరిగి కీసర పాఠశాలకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. తిరిగి సర్టిఫికేట్‌ను దక్కించుకునేందుకు విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీని ధిక్కరిస్తే ఎంతటి వారైనా వేటు తప్పదు

ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ.. పార్టీని ధిక్కరిస్తే ఎంతటివారైనా తప్పకుండా అధిష్టానం తగిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌పై ధిక్కార స్వరం వినిపిస్తున్న ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేయడం సరైన చర్య అని అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కుటుంబం ముఖ్యం కాదని, ఆయనకు తెలంగాణ ప్రజలే ముఖ్యమన్నారు. పార్టీలో కుమార్తె ధిక్కార స్వరం వినిపించడంతో ఆయన కుమార్తె అని ప్రేమ చూపించకుండా ఆమెను సస్పెండ్ చేసి పార్టీ కోసం నిలిచారన్నారు. ఇలాంటి గొడవలు ప్రతి పార్టీ, కుటుంబంలో సహజంగా జరుగుతాయన్నారు. సీబీఐ విచారణ చేసినా ఇతర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు చేసిన కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మచ్చలేకుండా కడిగిన ముత్యంలా వస్తారన్నారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ.. డ్రామాలు చేస్తుందని విమర్శించారు.

మహిళలు ఉపాధివైపు అడుగేయాలి



ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ క్లబ్ అధ్యక్షురాలు నీరజా

కీసర: రైజ్ విత్ రెస్పెక్ట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్‌లో భాగంగా నాగారం మున్సిపాలిటీ వికాస్‌నగర్ కాలనీలోని మహిళ శక్తి జూట్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ క్లబ్ అధ్యక్షురాలు రోటెరియన్ నీరజా గొడవర్తి, ట్రైనర్ నాగలక్ష్మి హాజరై జూట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. ఈ శిక్షణలో సుమారు 22 మంది మహిళలు హాజరయ్యారు. రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ క్లబ్ సభ్యులు రాహుల్‌జైన్, దుర్గాప్రసాద్, స్థానిక కాలనీ మహిళలు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'



సమావేశంలో మాట్లాడుతున్న మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: ఎన్నికల సమయంలో అలివిగాని వాగ్దానాలు చేసి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వందలాది ఎకరాలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నిరాధారణమైన ఆరోపణలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. బోడుప్పల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ తరుపున పోరాటం కొనసాగిస్తామన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్, రవికుమార్, నర్సింహ్మ, సామల మనోహర్‌రెడ్డి, రాసాల మహేష్‌యాదవ్, శ్రీనివాస్, అలీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు



బ్యాడ్మింటన్‌ను ఆడుతున్న మంత్రి దమోదర రాజనర్సింహ

కాప్రా: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో ఆసక్తి పెంచుకోవాలని మంత్రి దమోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కాప్రా సర్కిల్‌లో పర్యటించిన ఆయన ఫైర్ ర్యాలీ బ్యాట్మింటన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడపై ఆసక్తి పెంచుకుని, ఉన్నతంగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై సీబీఐ దర్యాప్తుతో అన్ని విషయాలు బయటపడతాయన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా జీవోలో పేర్కొని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

◆ కల్వకుంట్ల కవిత అంశం వారి అంతర్గత కుటుంబానికి సంబంధించిందని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అంతర్గత విషయాలు తమకు అవసరం లేదన్నారు.

అకాడమీ ఏర్పాటు అభినందనీయం...

కాప్రా పరిధిలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాను ముందుంటానన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. చెంగిచర్ల 3వ డివిజన్ పరిధిలో రూ.25లక్షలతో సీసీరోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభించిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, మాజీ కో– ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, విక్రమ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం

- 17 చెరువుల్లో ఇప్పటి వరకు 33,477 విగ్రహాల నిమజ్జనం
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు
- అన్ని వసతులు కల్పించామన్న కలెక్టర్ మనుచౌదరి



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17 చెరువుల వద్ద గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల వసతులను కల్పిస్తోంది. ఈనెల 27న గణనాథులు కొలువు దీరగా.. పదో రోజు 6న వినాయక నిమజ్జనానికి అధికారులు పకడ్బంది చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో 10 మంది సిబ్బంది..

ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్తు లైటింగ్, తాగునీటి వసతితో సహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజిన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయ్‌లెట్లు, టాయిలెట్లు సహా కనీస వసతులను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చెరువుల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా..

రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాధ్యతలను అప్పగించారు. నిమజ్జన ప్రాంతాలలోని చెరువులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలో 11 ఉండగా.. మిగతా ఆరు చెరువులు పురపాలక సంఘాల పరిధిలో ఉన్నాయి.

◆ జిల్లా వ్యాప్తంగా మూడు ఫీట్ల నుంచి మొదలుకుని 5 ఫీట్లకు పైగా ఉన్న వినాయక విగ్రహాలు దాదాపు 38,775 ప్రతిష్టించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించామని, 19 చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

◆ 8వ రోజు బుధవారం నాటికి నిర్దేశించిన చెరువుల్లో భక్తులు 33,477 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతేడాది వినాయక ఉత్సవాల్లో భాగంగా 17 చెరువుల్లో 36,456 వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు.

◆ 5 ఫీట్లకు పైన ఉన్న వినాయక విగ్రహాలు 11,558 ఉండగా.. ఐదు ఫీట్ల కంటే తక్కువగా 24,898 విగ్రహాలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

చెరువుల వద్ద స్పెషల్ ఆఫీసర్లు వీరే..

గణేష్ నిమజ్జనానికి 17 చెరువుల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ప్రశాంతంగా జరిగేలా 17 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. స్పెషల్ ఆఫీసర్లుగా వెంకట్‌గోపాల్–(సుతారిచెరువు), చంద్రప్రకాష్ –(పెద్దచెరువు), సాబేర్‌అలీ–(ప్రగతినగర్ ట్యాంకు), రాజు–(నల్లచెరువు), నర్సింహ–(వెన్నెలగడ్డ చెరువు), మల్లయ్య–(పరికి చెరువు), ఇస్లావత్ –(ఐడీఎల్ ట్యాంకు), గంగాధర్–(హస్మత్‌పేట్ బౌవెల్ చెరువు), స్వామి–(సున్నం చెరువు), ఎంఎస్‌ఆర్ జ్యోతి–(శామీర్‌పేట్ చెరువు), జాక్రియా సుల్తానా– (సఫిల్‌గూడ ట్యాంకు), శ్రీనివాస్‌రెడ్డి–(కొత్తచెరువు)లను కలెక్టర్ నియమించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387